







న్యూతనోత్సాహం

- కిటకిటలాడిన మార్కెట్లు
- జోరుగా పూలు, పండ్లు, బిర్యానీల విక్రయాలు
- చిందేసిన మందుబాబులు
- ఇళ్ల ముందు రంగవల్లులు
- కొత్త ఏడాదికి ఘన స్వాగతం

రాజానగరం: నూతన సంవత్సరానికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కొత్త ఏడాదిలో తమకు కలిసిరావాలని, తమ ఆశయాలు నెరవేరాలని, అనుకున్న లక్ష్యం సాధించుకోవాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం నుంచి మార్కెట్‌లో సందడి నెలకొంది. పాత ఏడాది చివరి రోజు పండ్లు, బొకేలు, బిర్యానీ సెంటర్లు, స్వీట్ షాపుల వద్ద సందడి నెలకొంది. కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలకడానికి ప్రజలందరూ ఏర్పాట్లు చేసుకున్నారు. 2024 ఆఖరి రోజైన మంగళవారం బ్రాందీ షాపులు, బిర్యానీ దుకాణాల వద్ద జన సందడి అధికంగా ఉంది. ఈ ఒక్క రోజే రాజానగరంలో సుమారు 50 వరకు స్పెషల్ బిర్యానీ పాయింట్లు వెలిశాయి. మెయిన్ రోడ్డుతో పాటు ప్రతి వీధిలోనూ బిర్యానీ పాయింట్లు దర్శనమిచ్చాయి. కొనుగోలుదార్లను ఆకర్షించే రీతిలో ఆఫర్లు పెట్టడంతో భారీ రద్దీ నెలకొంది. మద్యం దుకాణాలలో ధరలు మామూలుగానే ఉండగా, బిర్యానీ పాయింట్లలో ప్యాకెట్లకు కూల్ డ్రింక్ బాటిల్స్ ఆఫర్లు ఇచ్చారు. పూల దుకాణాలు, స్వీట్ స్టాళ్లలో కొనుగోలుదారులు కిటకిటలాడారు.


రాజానగరంలో పూలు, రంగులను కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాత్రి సమయంలో ప్రతి ఇంటి ముందు అందమైన రంగువల్లులు తీర్చిదిద్దారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికారు.

వేడుకలు

కొంకుదురు ఉన్నత పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాల వద్ద విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. బాలికలు ముగ్గులతో పాఠశాలను తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సందడి

పరిధిలోని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని తాకాయి. పలావు సెంటర్లు వినియోగదారులతో కిక్కిరిశాయి. పండ్లు, పూల బొకేల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మహిళల రంగవల్లులతో వీధులు ఆకర్షణీయంగా కనిపించాయి.


పందలపాకలో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు



కొంకుదురులో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



విద్యుత్ షాక్‌తో కాడెద్దుల మృతి

- సొంత పొలంలో ఖననం చేసి ప్రేమ చూపిన రైతు

సీతానగరం/రాజానగరం: సీతానగరం మండలం, మిర్తిపాడు శివారులో విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. బండి పై ఇనుప రేకుల బడ్డీని తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. రాజానగరం మండలం నరేంద్రపురానికి చెందిన ప్రగడ సుబ్రహ్మణ్యం అనే రైతు వెలుగుబందకు చెందిన కాడికట్టు రైతు దారా ఏసుబాబు అడగడంతో సీతానగరం మండలం కాటవరానికి ఇనుప రేకులతో తయారు చేసిన బడ్డీని తన బండిపై తరలించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమ్యస్థానానికి కొద్ది దూరంలో ఉండగా మిర్తిపాడు శివారు, కాటవరం సమీపంలో రోడ్డు పక్కన కరెంటు స్తంభాలకు వేలాడుతున్న విద్యుత్ లైన్ తీగలు బండిపై ఉన్న బడ్డీ ఇనుప రేకులకు తగిలి, విద్యుత్ షాక్ కొట్టడంతో కాడెద్దులు అక్కడికక్కడే చనిపోయాయి. ఆ సమయంలో బండి పై ఉన్న దారా ఏసుబాబును బండి ముందు పగ్గాలు పట్టుకుని నడుస్తున్న సుబ్రహ్మణ్యం కిందకు లాగడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఘటనా ప్రాంతాన్ని విద్యుత్ శాఖ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక రాజకీయ నాయకులు సందర్శించి, ప్రమాదం జరిగి తీరును పరిశీలించారు.


విద్యుత్ షాక్‌తో చనిపోయిన కాడెద్దులు

జీవనోపాధి పోయింది

ఉన్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేసుకుంటూ, బండి ఎద్దుల ద్వారా వచ్చే కిరాయితో కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్న నరేంద్రపురానికి చెందిన ప్రగడ సుబ్రహ్మణ్యం ఈ ప్రమాదంతో జీవనోపాధిని కోల్పోయాడు. ఎద్దులు చనిపోవడంతో సుమారు రూ.రెండు లక్షల నష్టానికి గురైన అతను తిరిగి ఎద్దులు కొనుగోలు చేయడం అంటే ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సాధ్యమయ్యే విషయం కాదు. సాటి రైతు బతిమాలడంతో బడ్డీ తరలింపుకు అంగీకరించానని, ఇంతటి నష్టం వాటిల్లుతుందని ఊహించలేదంటూ వాపోతున్నాడు. జరిగిన నష్టానికి విద్యుత్ శాఖ బాధ్యత వహించి, ఆ రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఎద్దులపై ఉన్న ప్రేమతో సుబ్రహ్మణ్యం వాటిని నరేంద్రపురానికి తీసుకువచ్చి, తన పొలంలోనే ఖననం చేశాడు.





కిశోర వికాస్ శిక్షణ కార్యక్రమం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోర వికాస్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.భారతి మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు ఆడపిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా చూడాలన్నారు. వారికి ప్రభుత్వ శాఖల అధికారులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు రక్షణ కల్పించాలన్నారు. అవసరమైన ప్రోత్సాహం, అవగాహన కల్పించి, ఆదర్శ యువతులుగా వికసించేటట్లు కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఏవీకే చైతన్య మాట్లాడుతూ గ్రామాల్లో 10 నుంచి 15 మంది కిశోర బాలికలను ఒక్కొక్క గ్రూపుగా సమీకరించాలన్నారు. వారికి పౌష్టికాహారం, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో కె.నాగ శేషవేణి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఈవోపీఆర్డీ మూర్తి పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వద్దు

బిక్కవోలు: ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ శాఖాధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు యూరియా అందడం లేదంటున్నారని వ్యవసాయ అధికారులు దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ మండల ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ పెంకె మంగయ్యమ్మ, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ బివివి సత్య కృష్ణ, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు





విద్యా బోధనలో నూతన ఒరవడి

రాజానగరం: ప్రాథమిక విద్యా బోధనలో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎం) శిక్షణ నూతన ఒరవడిని తీసుకువస్తుందని ట్రైనింగ్ సెంటర్ కోర్సు కో ఆర్డినేటర్ పి. రాంబాబు అన్నారు. కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎం ఆరో బ్యాచ్ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల స్థాయిని దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు బోధన చేస్తే, విద్యార్థులలో అభ్యసనా స్థాయి పెరుగుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థిని స్థాయికి అనుగుణంగా బోధన జరగాలన్నారు. భాష, గణితంలో అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. డైట్ లెక్చరర్ ఎం.జానకీదేవి, ఎంఈఓ సీహెచ్ సోమిరెడ్డి, ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ జి.అనూష మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వివిధ అంశాలను బోధనలో ప్రతిఫలించేలా చేస్తే ప్రాథమిక విద్యలో అద్భుత ఫలితాలు చూడగలరన్నారు. అనంతరం గత రెండు రోజులుగా నిర్వహించిన టీఎల్ఎం మేళాలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి. అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 330 మంది ఉపాధ్యాయులు, డీఆర్పీలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి

సీతానగరం: బీజేపీ మండల అధ్యక్షురాలిగా రాపాక వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమెను ఎన్నుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన మాలతి రాణి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు.

పింఛన్లు అందజేత

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందించారు. ఆయన మాట్లాడుతూ పింఛను పొందుతూ నవంబరు నెలలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు వెంటనే కొత్త పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా తొలి రోజు 91 శాతం మేర పింఛన్లను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రావాడ నాగు, బీజేపీ మండల కన్వీనర్ మేడపాటి దుర్గారెడ్డి, మండల నీటి సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సునీత

సీతానగరం: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా సునీత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె రెండు నెలల క్రితం రాజానగరం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. అయితే డిప్యూటేషన్‌పై రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ మేరకు మంగళవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు.

అందరి సహకారంతో అభివృద్ధి

రంగంపేట: రాజకీయాలకు అతీతంగా అంతా కలిసి గ్రామాలను అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజాప్రతినిధులు అంతా సహకరిస్తే ప్రభుత్వం తరఫున కూడా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. చాగల్నాడు ఎత్తిపోతల పథకం అభివృద్ధికి రూ. 9 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీలు మట్టా శ్రీను, రాయుడు రాంబాబు, తహసీల్దార్ అనసూయ, ఎంపీడీఓ వీర సాయిబాబు, ఈఓపీఆర్డీ వెంకటరత్నంతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ వెతలు తప్పేదెప్పుడో!

- రాజానగరంలో వాహనాల రద్దీ
- రాకపోకలకు తీవ్ర అవస్థలు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం ట్రాఫిక్ కోరల్లో చిక్కుకుంది. వాహనాల రద్దీ విపరీతంగా పెరగడం, దానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామంలో జనాభా రోజు రోజుకూ పెరుగుతోంది. సమీపంలోని వైద్య కళాశాలలు, విద్యాసంస్థలు ఉండడంతో వాటిలోని ఉద్యోగులు, విద్యార్థులు రాజానగరంలో నివాసం ఉంటున్నారు. జాతీయ రహదారిని అనుకుని ఉండడంతో పాటు రాజమహేంద్రవరం, విశాఖపట్నం, కాకినాడ నగరాలకు వెళ్లడానికి ఇక్కడ నుంచి రవాణా సౌకర్యాలు ఉన్నాయి. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఎప్పుడూ రాజానగరం కిటకిటలాడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. నూతన ఏడాది సందర్భంగా మంగళవారం సాయంత్రం నుంచి సందడి మొదలైంది. బిర్యానీ సెంటర్లు, పూల దుకాణలు, స్వీట్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వాటిని కొనుగోలు చేసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. దీంతో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ వరకూ విపరీతమైన రద్దీ నెలకొంది. ఇంత జరుగుతున్నా, ట్రాఫిక్ పెరిగిపోతున్నా అక్కడ ట్రాఫిక్ పోలీసు లేకపోవడం గమనార్హం.


రాజానగరం గాంధీ బొమ్మ సెంటర్‌లో మంగళవారం రాత్రి ఏర్పడిన ట్రాఫిక్ జామ్

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం కావడంతో భారీ ఎత్తున భక్తులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాలను దర్శించిన ట్రైనీ కలెక్టర్

బిక్కవోలు: మండలంలోని ప్రాచీన ఆలయాలను కాకినాడ జిల్లా ట్రైనీ కలెక్టర్ భావన దర్శించుకున్నారు. మంగళవారం బిక్కవోలులోని లక్ష్మీ గణపతి, కుమార సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలను ఆమె దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్ భావన

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెదపూడి: సంపర గ్రామంలో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామికి ధనుర్మాసం 16వ రోజు సందర్భంగా పంచామృతాభిషేక పూజలు చేశారు. రంగనాథ స్వామికి తులసీ దళాలు, గోదాదేవికి కుంకుమ పూజలు చేశారు. తిరుప్పావై పాశుర పఠనం జరిగింది. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.


సంపరలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

గజవాహనంపై గ్రామోత్సవం


గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, లఘు అర్చన, తోమాలసేవ, పంచామృతాభిషేకం, గోపూజ, పవళింపు సేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారిని గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చర్చిల్లో జాగరణ ప్రార్థనలు


చర్చిలో ప్రార్థన చేస్తున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి పలు చర్చిల్లో జాగరణ ప్రార్థనలు నిర్వహించారు. కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మాణిక్యం ఆధ్వర్యంలో, పశ్చిమగానుగూడెం సెయింటనరీ సెయింట్ లూథరన్ చర్చిలో పాస్టర్ కృపావిల్సన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.